క్లుప్తంగా

భక్తిభావం ఉండాలి



బతుకమ్మ సంబురాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల

అనంతగిరి: ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. వికారాబాద్‌లో పలు వినాయక మండపాలను ఆమె సందర్శించి పూజలు చేశారు. అనంతరం శివారెడ్డి పేట మండపం వద్ద బతుకమ్మ ఆటలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు ఆమెను సత్కరించారు.

ముదిరాజ్ భవన నిర్మాణానికి నిధులు



నిధుల పత్రాన్ని అందజేస్తున్న బండప్రకాశ్

బొంరాస్‌పేట: దుద్యాల మండల పరిధి లగచర్లలో ముదిరాజ్ భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని బీఆర్ఎస్ మండల నాయకుడు, ముదిరాజ్ సంఘం నేత బోగమోని సురేష్ తెలిపారు. ఈ మేరకు శాసన మండలి చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్ మంజూరు పత్రం, త్వరగా పనులు ప్రారంభించేందుకు తక్షణంగా రూ.5లక్షల చెక్కును అందజేసినట్లు వెల్లడించారు.

అభ్యాసం మెరుగు పర్చేందుకే..



సల్బత్తాపూర్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

బంట్వారం: స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ ప్రాక్టీస్ పరీక్షలను శనివారం బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా 3,6,9 తరగతి విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ఎంఈఓ చంద్రప్ప తెలిపారు. ఆరు దశల్లో ఎస్‌సీఈఆర్‌టీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థుల అభ్యాసం మెరుగు పర్చేందుకే ప్రభుత్వం ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా మల్లికార్జున్



నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

అనంతగిరి: ఎమ్మార్పీఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా మల్లికార్జున్‌ను నియమించారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సుభాష్, అధికార ప్రతినిధిగా ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా మల్కప్ప, శంకర్, జగన్, కార్యదర్శులుగా అంజి, శేఖర్, సహాయ కార్యదర్శిగా హరిసూదన్, ప్రచార కార్యదర్శిగా నర్సింహులును నియమించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి శివ, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యక్షుడిగా సుభాష్..



సుభాష్‌కు కండువా కప్పుతున్న ఎమ్మార్పీఎస్ నాయకుడు

బొంరాస్‌పేట: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్)జిల్లా ఉపాధ్యక్షుడిగా ఆ సంఘం మండల అధ్యక్షుడు సుభాష్ మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడారు. మాదిగలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై చైతన్యం కల్పించేందుకు ఎమ్మార్పీఎస్ కృషి చేస్తుందన్నారు. మాదిగల కోసం నిరంతరం పనిచేస్తానన్నారు.

గిరిజనుల మద్దతు కాంగ్రెస్‌కే

బొంరాస్‌పేట: కాంగ్రెస్ పార్టీకే వలస గిరిజనులు మద్దతు తెలుపుతున్నారని ఆ పార్టీ దుద్యాల మండల అధ్యక్షుడు శేఖరయ్య తెలిపారు. మహారాష్ట్రకు వలసవెళ్లి పుణేలో ఉంటున్న జిల్లా గిరిజనులతో ప్రత్యేక సభ ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సభలో కాంగ్రెస్ వైపే మొగ్గు చూపుతున్నారన్నారు. పరిగి మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

యంత్రం తుప్పు.. ఎవరిది తప్పు

- ఎనిమిదేళ్లుగా మూలనపడిన జనరేటర్లు!
- విద్యుత్ అంతరాయంతో కార్యకలాపాల్లో పనులకు ఆటంకం
- అందుబాటులో లేని ఇన్వర్టర్లు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న జనరేటర్

దౌల్తాబాద్: అత్యవసరాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే పనులకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం సుమారు ఎనిమిదేళ్ల క్రితం మండల రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల్లో జనరేటర్లు ఏర్పాటు చేసింది. ఏళ్లు గడుస్తున్నా వాటిని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో అవి తుప్పు పట్టాయి. దీంతో ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరులా మారిందని, యంత్రాలు అలా మారడానికి తప్పు ఎవరిదని పలువురు ప్రశ్నిస్తున్నారు. జనరేటర్లను ఏర్పాటు చేసినప్పటి నుంచి కొన్ని రోజులు మాత్రమే ఉపయోగించి, ఆ తర్వాత పట్టించుకోలేదు. దీంతో కరెంట్ కోతల సమయంలో అధికారులు, పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.

గంటల తరబడి..

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు కంప్యూటర్లు, ఫ్యాన్లు ఆగిపోయి కార్యకలాపాలకు తీవ్ర ఆటంకం కలగడం, కనీసం ఇన్వర్టర్ల సౌకర్యం కూడా లేకపోవడంతో కరెంట్ వచ్చే దాకా పనులు నిలిచిపోవటంతో.. పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు గంటల కొద్దీ నిరీక్షణ తప్పడం లేదు. తహసీల్దార్ ఆఫీస్‌లో జనరేటర్ వినియోగంలోలేదు. ఇన్వర్టర్లు ఏర్పాటు చేసుకున్నారు. అవి కొంత సమయం వరకు మాత్రమే పనిచేస్తున్నాయి. అలాగే మండల పరిషత్, ఐకేపీ, ఎంఆర్‌సీలు నిత్యం బిజీగా ఉంటాయి. ఆన్‌లైన్‌తోనే ఎక్కువగా పనులు కొనసాగుతుంటాయి. అయితే జనరేటర్లు, ఇన్వర్టర్లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కంప్యూటర్లకు యూపీఎస్‌లు ఉన్నప్పటికీ 10నిమిషాల కంటే ఎక్కువసేపు పనిచేయవు. నిధుల కొరత కారణంగా వాటిని సమకూర్చుకోలేక పోతున్నామని అధికారులు అంటున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి కరెంట్ కష్టాలకు చెక్ పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తేవాలి



ప్రభుత్వ కార్యాలయానికి సర్టిఫికెట్ ఇతర ఆన్‌లైన్ పనుల కోసం వెళ్లినప్పుడు కరెంట్ పోతే, మళ్లీ వచ్చే దాకా నిరీక్షించాల్సి వస్తోంది. కార్యాలయాల ఆవరణలో ఏర్పాటు చేసిన జనరేటర్లు తుప్పు పట్టిపోతున్నా వాటిని ఎవరూ పట్టించుకోవడంలేదు. వినియోగంలోకి తేవాలి.

– బాబుజీ, దౌల్తాబాద్

ఇబ్బందిగా ఉంది



కరెంట్ పోయినప్పుడు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇన్వర్టర్ లేదు. జనరేటర్ కార్యాలయ ఆవరణలో ఎప్పుడో ఏర్పాటు చేశారు. కానీ అది పనిచేయడం లేదు. దాని గురించి సమాచారం లేదు. వినియోగించేందుకు తగిన ఏర్పాట్లు లేవు. ఈ విషయం ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పాము.

– తిరుమలస్వామి, ఎంపీడీఓ, దౌల్తాబాద్

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య



సమావేశంలో మాట్లాడుతున్న మండల విద్యాధికారి

- ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపించండి
- విద్యార్థుల తల్లిదండ్రులతో ఎంఈఓ హరిశ్చందర్

పరిగి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. మండల పరిధి సయ్యాద్‌మల్కాపూర్‌లో శనివారం విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పాఠశాలలో నేర్పిన పాఠ్యాంశాలపై తల్లిదండ్రులు ఇంటి దగ్గర శ్రద్ధ తీసుకుని నేర్పించాలన్నారు. అదే విధంగా పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు ఎలా బోధిస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. సర్కారు బడుల్లో ప్రైవేటుకు దీటుగా విద్య అందుతుందని, కావున ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఫయూం సుల్తానా, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు రుక్మిణి, భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత

కొడంగల్ రూరల్: చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తే మెదడు చురుగ్గా పనిచేస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.రాజారామ్ అన్నారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కదలిక సాహిత్య పరిషత్ కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. 'ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక' అని కాళోజీ కవితా వాక్యం అందరికీ ఆదర్శమన్నారు. తెలుగు అధ్యాపకులు మోహన్, నర్సింహులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

తొలగించడం కాదు.. చేర్చండి

ధారూరు: మృతి చెందిన, వివాహాలు చేసుకుని వెళ్లిపోయిన వారి పేర్లను రేషన్‌కార్డు లోంచి తొలగించడంతో పాటు ఇంట్లోకి కొత్తగా వచ్చిన వారి పేర్లను కూడా చేర్చాలని కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీటీసీ రమేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బతికి ఉన్నవారి పేర్లను ఈకేవైసీ ద్వారా వేలిముద్రలు వేయించి సరిచేస్తున్నారని, చిన్నపిల్లలు, కొత్తగా ఇంటికి వచ్చిన కోడళ్లను ఎందుకు చేర్చడం లేదని ప్రశ్నించారు. రేషన్ బియ్యం అందక అర్హులు నష్టపోతున్నారని, ఇప్పటికైనా రేషన్‌కార్డుల్లో ఈకేవైసీ ద్వారా లేనివారి పేర్లు తొలగిస్తున్నట్లే.. ఉండి పేర్లు లేని వారి పేర్లను చేర్చాలని కోరారు.

బిల్లు దిష్టిబొమ్మ దహనం

కొడంగల్ రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లును సవరించాలని ధర్మ సమాజ్‌పార్టీ జిల్లా కో కన్వీనర్ వెంకట్‌రాములు, నియోజకవర్గ సభ్యుడు నిఖిల్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో 33శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు దిష్టిబొమ్మను దహనం చేశారు. 90శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల మహిళలకు తగిన ప్రాధాన్యత ఇస్తూ బిల్లును సవరించాలని కోరారు. ఇందులో తిరుమల్, భీమరాజ్ తదితరులు ఉన్నారు.

'రాబోయేది ఇందిరమ్మ రాజ్యం'

పెద్దేముల్: రాష్ట్రంలో మళ్లీ ఇందిరమ్మ రాజ్యం రాబోతుందని కాంగ్రెస్ పార్టీ తాండూరు నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడు లోంక నర్సింహులు అన్నారు. శనివారం పెద్దేముల్ మండలం మదనంతపూర్, కొండాపూర్ తదితర గ్రామాల్లో పర్యటించి, మండల కమిటీ, బూత్ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఆ పార్టీని ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మండల బీసీసెల్ అధ్యక్షుడు వెంకటయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్యాల ప్రవీణ్‌కుమార్, మండల కోఆప్షన్ సభ్యుడు నజీర్, నాయకులు న్యాయవాది ఎల్లారెడ్డి, దాసరి నర్సింహులు, రాము నాయక్, ఆనంద చారీ, షబ్బీర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని ఓడిస్తాం



గ్రామ కమిటీలతో నాయకులు

తాండూరు రూరల్: తల్లిలాంటి పార్టీని వీడి మోసం చేసిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని ఓడి స్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప అన్నారు. శనివారం పలు గ్రామాల్లో పార్టీ గ్రామ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాండూరు మండలంలో పార్టీ బలంగా ఉందని, ప్రతి కార్యకర్త కష్టపడి పని చేస్తే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు మనదేనని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పురుషోత్తంరెడ్డి, జర్నప్ప, అశోక్‌కుమార్, జగదీష్, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌లు ఉన్నారు.

సీనియర్ సిటీజన్ల సమస్యలు పరిష్కరించాలి

అనంతగిరి: సీనియర్ సిటీజన్ల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మాణిక్ ప్రభు ఒక ప్రకటనలో కోరారు. సీనియర్ సిటీజన్ల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మోడీ, సీఎం కేసీఆర్‌కు పోస్ట్ కార్డు ద్వారా తమ సమస్యలపై పోస్ట్ చేయాలని సూచించారు. కేంద్రం వెంటనే పోషణ సంక్షేమ రక్షణ చట్టం 2019 సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింప చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే టికెట్‌లో గతంలో ఇచ్చిన రాయితీలను పునరుద్ధరించాలని, పింఛన్ దారులకు ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. సీఎం కేసీఆర్ సీనియర్ సిటీజన్లకు ప్రత్యేక సంక్షేమ శాఖ, డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం రాయితీ కల్పించాలన్నారు.

రుణమాఫీ డబ్బు రైతులకు ఇవ్వండి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ మాజీ డైరెక్టర్ బస్వరాజ్

కొడంగల్: రుణమాఫీ డబ్బులను రైతులకు చెల్లించాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఆర్.బస్వరాజ్ అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం మాట్లాడారు. డీసీసీబీ పరిధి సొసైటీల్లో (పీఏసీఎస్) రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేసిందన్నారు. ప్రభుత్వం చెల్లించిన డబ్బులను బ్యాంకు అధికారులు, సొసైటీ సిబ్బంది రైతుల అప్పు ఖాతాలో జమచేస్తున్నారని ఆరోపించారు. అప్పు ఖాతాల్లో జమ చేయకుండా ఎస్‌బీ ఖాతాల్లో జమ చేసి, నేరుగా రైతులకు చెల్లించాలని చెప్పారు. రైతులు ఇప్పటికే వారు తీసుకున్న పంట రుణాలను రెన్యూవల్ చేశారని, రెన్యూవల్ చేసుకున్న ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు వేయడం వలన రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం చెల్లించిన మాఫీ డబ్బులను అప్పులో తీసి వేస్తున్నారని పేర్కొన్నారు. అలా చేయడం వలన రైతులు మళ్లీ బ్యాంకుల చుట్టూ తిరిగి పంట రుణాలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. రానున్న రోజుల్లో ఏ ప్రభుత్వం వచ్చినా రుణమాఫీ చేసే అవకాశం ఉందన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం చెల్లించిన డబ్బులను లోన్ ఖాతాల్లో జమ చేస్తే రైతు పేరుమీద ఉన్న అప్పు తగ్గిపోతుందన్నారు. తర్వాత వచ్చే ప్రభుత్వం రుణమాఫీ చేస్తే రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని డీసీసీబీ అధికారులు గమనించి రైతులకు మాఫీ డబ్బులను ఎస్‌బీ ఖాతా ద్వారా నేరుగా చెల్లించాలని డిమాండ్ చేశారు.

'మనబడి' పనులు పూర్తి చేయాలి

- కిందిస్థాయి ఉద్యోగులను పంపిస్తున్న అధికారులు
- సర్వసభ్య సమావేశంలో పీఆర్ఏఈ, సభ్యులు
- అర్హులందరికీ విడతల వారీగా రుణమాఫీ: ఎంపీపీ



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్ఏఈ ప్రవీణ్‌కుమార్

మోమిన్‌పేట: పాఠశాల పనులను వెంటనే పూర్తి చేయాలని పీఆర్ఏఈ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వసంత అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో మనఊరు–మనబడి కింద 19పాఠశాలలకు పనులు మంజూరు కాగా 4 మాత్రమే పూర్తి అయ్యాయని సభ దృష్టికి తీసుకు వచ్చారు. మిగతా గ్రామాల్లో పనులు పూర్తి చేయాలన్నారు. మండలంలో నాలుగు బీటీరోడ్లకు మోక్షం లభించిందని, త్వరలో పనులు ప్రారంభించేందుకు ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ.. ప్రతి సర్వసభ్య సమావేశానికి ప్రభుత్వ అధికారులు కింది స్థాయి ఉద్యోగులను పంపిస్తున్నారని ఆరోపించారు.

కుళాయిల చరలు తొలగింపు..

పల్లెల్లో భగీరథ నీటికి బిగించిన కుళాయిల చరలు కొందరు తొలగించి, ఇతరులకు రాకుండా చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని సర్పంచులు సభ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఏఈ నయనశ్రీ మాట్లాడుతూ అందుకు పూర్తి బాధ్యత సర్పంచులే తీసుకోవాలని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే కేసులు నమోదు చేసే బాధ్యత జీపీలకు ఉందన్నారు. కొందరు రుణమాఫీ గురించి ప్రస్తావన తేగా.. అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ వర్తిస్తుందని, దశల వారీగా ప్రభుత్వం మాఫీ చేస్తుందని ఎంపీపీ వసంత పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు బాగ్దాద్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఏఓ జయశంకర్, పశు వైద్యాధికారి గీత, వైద్యాధికారి సుజల, ఎంఈఓ గోపాల్, ఏపీఓ శంకర్, ఏపీఎం రాజు తదితరులు ఉన్నారు.

పేదల ఉన్నతికి తపించిన 'కొప్పుల'



ధారూరు: హరీశ్వర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో..

- బీఆర్ఎస్ నాయకులు
- మాజీ ఎమ్మెల్యే హరీశ్వర్‌రెడ్డికి నేతల నివాళి

ధారూరు: గుండెపోటుతో అకాల మరణం పొందిన మాజీ స్పీకర్ హరీశ్వర్‌రెడ్డికి శనివారం బీఆర్ఎస్ పార్టీ ధారూరు మండల నాయకులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు రాజునాయక్, మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు వెంకటయ్య, జిల్లా కోఆప్షన్ సభ్యుడు అజీమ్‌ఖురేషి, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు సంతోష్‌కుమార్, అంజయ్య, మండల యూత్ ప్రెసిడెంట్ జైపాల్‌రెడి, నాయకులు సుధాకర్‌గౌడ్, రహమతుల్లాఖాన్, రాజుగుప్తా పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల హరీశ్వర్‌రెడ్డి మృతికి బీఆర్ఎస్ శ్రేణులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో హరీశ్వర్‌రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బడుగుబలహీన వర్గాల ఉన్నతికి కొప్పుల చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఇందులో కుల్కచర్ల జెడ్పీటీసీ రాందాస్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ, నాయకులు ఆంజనేయులు, కొండయ్య, చౌడాపూర్ పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, యువజన విభాగం అధ్యక్షుడు మేగ్యానాయక్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నర్సింహులు ఉన్నారు.

కంప్యూటర్ విద్యపై అవగాహన తప్పనిసరి



కంప్యూటర్ గదిని ప్రారంభిస్తున్న ఇందిర

మర్పల్లి: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సైన్స్, కంప్యూటర్ విద్యపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అమేజాన్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఇందిర ప్రియదర్శిని అన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు విఠల్‌రెడ్డి కోరిక మేరకు శనివారం జగతి ఫౌండేశన్ ఆధ్వర్యంలో అమేజాన్ సంస్థ వ్యవస్థాపకురాలు దుర్గ కల్యాణితో కలిసి ఆమె 3 కంప్యూటర్లు, సైన్స్ ల్యాబ్ ప్రారంభించి మాట్లాడారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంలో విద్యార్థులు చిన్ననాటి నుంచే పోటీ తత్వంగా చదుకోవాలని సూచించారు. ఉన్నతికి ఎదిగిన వారిని ఆదర్శంగా తీసుకొని క్రమ శిక్షణతో కూడిన విద్యను అభ్యసించి, ఉన్నతశిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నర్సింహులు, సర్పంచ్ ప్రభాకర్, ఉప సర్పంచ్ రాములు, విద్యా కమిటీ చైర్మన్ పాపయ్య, అమేజాన్ సంస్థ ఉపాధ్యక్షుడు అబు బకర్, జాయింట్ సెక్రటరీ రామచంద్ర, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి శుభాకాంక్షల వెల్లువ

జనహృదయ నేత, మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ నేతలు, పలువురు ప్రజాప్రతినిధులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మాట్లాడారు. నిరంతరం ప్రజాసేవకు పరితపిస్తున్న పట్నం.. మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు.

– సాక్షి, నెట్‌వర్క్




తాండూరు రూరల్: మంత్రి పట్నం మహేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఎండీ హమీద్ మియా



వికారాబాద్ అర్బన్: మంత్రి పట్నంకు శుభాకాంక్షలు తెలుపుతున్న వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్ల పల్లి మంజుల దంపతులు



బొంరాస్‌పేట: మంత్రికి శుభాకాంక్షలు చెబుతున్న పీఏసీఎస్ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు యాదగిరి, రమణారెడ్డి



పెద్దేముల్: హైదరాబాద్‌లో మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



తాండూరు: మంత్రి పట్నం మహేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు